ఓటుకు నోటు కేసులో
కీలక మలుపు..
సుప్రీంకోర్టులో
స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్
పిటిషన్ 2

Neti Velugu
# నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
RNI NO. TELTEL/2023/88559
www.epaper.netivelugu.com
netivelugu63@gmail.com

నేటి వెలుగు
తెలుగు దినపత్రిక
రిపోర్టర్లు కావలెను
తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్
రెండు తెలుగు రాష్ట్రాలలో నేటి వెలుగు తెలుగు దినపత్రికలో పని చేయుటకు
జిల్లా బ్యూరో
జిల్లా స్టాఫ్
డివిజన్ అసెంబ్లీ ఇంచార్జిలు
మండల రిపోర్టర్లు
జూనియర్లకు సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును.
సంప్రదించవలసిన ఫోన్ నెంబరు
95532 76552
ఎడిటర్
నవీన్ కుమార్ గౌడ్

నల్గొండ | సంపుటి : 3 | సంచిక : 174 | పేజీలు : 4 | అక్టోబర్ 6 మంగళవారం 2026 | వెల రూ. 4.00/-
NALGONDA | VOL:3 | ISSUE: 174 | PAGES:4 | TUESDAY OCTOBER 6 2026 | Rs. 4:00




# ఫామ్-6 మార్పులపై రాజకీయ దుమారం..
# సీఈసీపై రాహుల్ గాంధీ ఆరోపణలు

- ఫామ్-6 మార్పులపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- 'మార్పులను మేము ఆమోదించలేదు' అని స్పష్టం చేసిన సీజేఐ
- మార్పులు ఎవరి అనుమతితో జరిగాయో రికార్డులు కోరిన కోర్టు
- సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ చట్టవిరుద్ధంగా వ్యవహరించారంటూ రాహుల్ ఆకోపణ
- బీజేపీకి ప్రయోజనం చేకూర్చేలా వ్యవహరించారంటూ విమర్శ
- ఈసీ నిర్ణయాల విధానంపైనా సుప్రీంకోర్టు నోటీసులు

న్యూఢిల్లీ, అక్టోబర్ 5: ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు ఉపయోగించే ఫామ్-6లో చేసిన మార్పుల వ్యవహారం రాజకీయంగా, న్యాయపరంగా చర్చనీయాంశంగా మారింది. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్‌పై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. ఫామ్-6లో మార్పులను చట్టవిరుద్ధంగా, ఏకపక్షంగా చేశారని, ఈ మార్పుల వల్ల బీజేపీకి ప్రయోజనం కలిగేలా వ్యవహరించారని రాహుల్ ఆరోపించారు. అయితే ఇవి రాహుల్ గాంధీ చేసిన రాజకీయ ఆరోపణలేనని, వాటిపై తుది నిర్ధారణ జరగాల్సి ఉందని స్పష్టంగా చూడాలి. ఫామ్-6పై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

## ఫ్యూచర్ సిటీలో విదేశీ వర్సిటీల క్యాంపస్‌లు.. ప్రత్యేక పాలసీకి తెలంగాణ సర్కార్ ప్లాన్

- అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థల ఏర్పాటుకు తెలంగాణ కీలక చర్యలు
- ఫ్యూచర్ సిటీలో ప్రముఖ విదేశీ యూనివర్సిటీల క్యాంపస్‌లు ఏర్పాటుకు ప్రత్యేక పాలసీ
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశాలు
- అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచన
- 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్'పైనా సమీక్ష

తెలంగాణలో అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థలను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోంది. ఫ్యూచర్ సిటీలో ప్రముఖ విదేశీ యూనివర్సిటీల క్యాంపస్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక పాలసీ రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను

(మిగతా 2వ పేజీలో..)



## యూపీలో బీజేపీ రాజ్యసభ ఎంపీలకు షాక్.. అభ్యర్థుల లిస్టులో లేని పేర్లు..

ఇంటర్నెట్ డెస్క్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని కొన్ని రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు సమీపించిన వేళ కేంద్రమంత్రులు హర్దీప్ సింగ్ పూరి, బి.ఎల్. వర్మలకు షాక్ తగిలింది. రాజ్యసభ ఎన్నికల నామినేషన్ కోసం బీజేపీ అధిష్ఠానం విడుదల చేసిన జాబితాలో వీరి పేర్లు లేవు. అలాగే ఇప్పటికే ఆ స్థానాల్లో ఎంపీలుగా ఉన్న మిగిలిన వారినీ ఆ పార్టీ అభ్యర్థులుగా ప్రకటించలేదు. అరుణ్ సింగ్, సీమా




(మిగతా 2వ పేజీలో..)

## రామప్పను కాపాడుకునేందుకు ఉద్యమిస్తాం

హైదరాబాద్, అక్టోబరు 5

యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం సమీపంలో ఓపెన్‌కాస్ట్ బొగ్గు గని ఏర్పాటు ప్రతిపాదనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం



(మిగతా 2వ పేజీలో..)

## కాళేశ్వరం మరమ్మతులు త్వరగా చేపట్టండి

### నీటిపారుదల శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

హైదరాబాద్, అక్టోబరు 5 కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులను నిర్ణీత వ్యవధిలోగా చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం రాత్రి నీటిపారుదలశాఖపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి సీఎం సమీక్ష నిర్వహించారు. కాళేశ్వరం బ్యారేజీల పునాదుల కింద భారీగా ఇసుక మైనింగ్ జరిగిందని, నిర్మాణ సమయంలో డిజైన్‌కు విరుద్ధంగా సీకెంట్ పైల్స్‌ను వినియోగించారని, వీటి అమరిక సరిగ్గా లేనందువల్ల బ్యారేజీల పునాదులు దెబ్బతిన్నాయని అధికారులు సీఎంకు నివేదించారు. మూడు బ్యారేజీలను పునరుద్ధరించి, మళ్లీ వినియోగంలోకి తేవాలంటే విధిగా బ్యారేజీల ఎగువ (అప్‌స్ట్రీమ్),

(మిగతా 2వ పేజీలో..)



## ఆకాశంలో బియ్యం, నిత్యావసరాల ధరలు

హైదరాబాద్, అక్టోబరు 5

రాష్ట్రంలో సన్నబియ్యంతో పాటు నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నా.. ధరల నియంత్రణలో చేతులెత్తేసిన రేవంత్‌రెడ్డి



(మిగతా 2వ పేజీలో..)

నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్
ఎడిటర్ & పబ్లిషర్

## యూపీలో బీజేపీ రాజ్యసభ ఎంపీలకు షాక్.. అభ్యర్థుల లిస్టులో లేని పేర్లు..

**(మొదటి పేజీ తరువాయి)**

ద్వివేది, నీరజ్ శంకర్, బ్రిజ్ లాల్, గీతా శక్య ఆ స్థానాల్లో సిట్టింగ్ ఎంపీలుగా ఉన్నారు. వీరిని పక్కన పెట్టి కొత్తవారికి అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ నిర్ణయించుకుంది. అక్కడ ఈ నెల 16న పది రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. అందులో ఎనిమిది స్థానాలు బీజేపీ, రెండు స్థానాలు సమాజ్‌వాది పార్టీ గెలిచే అవకాశాలున్నాయి. ఈ సందర్భంగా 8 స్థానాలకు గానూ కాషాయ పార్టీ తన అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. ధరంపాల్ సింగ్, రాధాకాంత్ ఓజా, ప్రకాశ్ పాల్, ప్రియాంక సింగ్ రావత్, గోపి కృష్ణా పాండే, రామ్ ప్రతాప్ సింగ్ చౌహన్, శృతి గంగ్వార్‌లను అభ్యర్థులుగా ప్రకటించింది. అయితే ఈ జాబితాను పరిశీలించిన రాజకీయ విశ్లేషకులు.. బీజేపీ విభిన్న అభ్యర్థులను ఎంచుకోవాలని భావించిందని చెబుతున్నారు. వీరిలో ఇద్దరు ఓబీసీ అభ్యర్థులు, ఇద్దరు షెడ్యూల్డ్ కులాల అభ్యర్థులు ఉన్నారు. అలాగే ఇద్దరు అగ్ర వర్ణాల వారూ ఉన్నారు. జాబితాలో ఇద్దరు మహిళా అభ్యర్థులకు చోటు దక్కింది. 2027లో యూపీ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న తరుణంలో బీజేపీ ఇప్పటి నుంచి రాజకీయ కసరత్తులు చేస్తోందని పలువురు పేర్కొంటున్నారు.

## రామప్పను కాపాడుకునేందుకు ఉద్యమిస్తాం

**(మొదటి పేజీ తరువాయి)**

చేశారు. ఈ ప్రాజెక్టును తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రామప్పను కాపాడుకునేందుకు భారీ ఎత్తున ప్రజా ఉద్యమం చేపడతామని సోమవారం ఎక్స్ వేదికగా కేటీఆర్ హెచ్చరించారు. రాష్ట్రంలో భూముల దోపిడీ ముగిసిందన్నట్లుగా, ఇప్పుడు ప్రభుత్వం కన్ను ఖనిజ సంపదపై పడిందని మండిపడ్డారు. చారిత్రక కట్టడాలను దెబ్బతీసే చర్యలను బీఆర్ఎస్ పార్టీ సహించబోదని స్పష్టం చేశారు. రామప్ప దేవాలయానికి అతి సమీపంలో ఓపెన్‌కాస్ట్ బొగ్గుగని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధపడటం దారుణమన్నారు. మీటర్లకొద్దీ లోతులో తవ్వకాలు, బ్లాస్టింగ్స్ చేయడం వల్ల తెలంగాణ శిల్పకళా వైభవానికి ప్రతీకైన రామప్ప దేవాలయంతో పాటు రామప్ప చెరువు మనుగడకు ముప్పు వాటిల్లుతుందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు.

## ఆకాశంలో బియ్యం, నిత్యావసరాల ధరలు

**(మొదటి పేజీ తరువాయి)**

సర్కార్ మాత్రం నేలచూపులు చూస్తోందని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. నిత్యావసరాల ధరలు సామాన్యుడి నడ్డి విరుస్తుంటే.. ధరలకు నియంత్రించాల్సిన సర్కార్ మొద్దునిద్రలో ఉండటం దారుణమని సోమవారం ఎక్స్‌లో ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం, పర్యవేక్షణ వైఫల్యానికి సామాన్య ప్రజలే మూల్యం చెల్లించాల్సి వస్తోందని, సన్నబియ్యం ధరలు కేవలం నాలుగు నెలల్లోనే 25 శాతం పెరగడం ప్రభుత్వానికి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. మీరు ఇస్తున్న సన్నబియ్యం పథకం సఫలమైతే, బియ్యం ధరలు ఎందుకు అదుపు తప్పుతున్నాయి? మీరిచ్చే నాణ్యతలేని సన్నబియ్యాన్ని ప్రజలు వినియోగించడం లేదని చెప్పడానికి ఇది నిదర్శనం కాక మరేమిటని నిలదీశారు.'రైతుకు గిట్టుబాటు ధర లేదు. వినియోగదారుడికి అందుబాటు ధర లేదు. లాభపడుతున్నది మాత్రం మధ్య దళారులే. కళ్ళముందే ఈ తతంగం అంతా జరుగుతుంటే, ప్రభుత్వంలో ఎందుకు చలనం లేదు' అని ప్రశ్నించారు. బియ్యం మాత్రమేకాదు.. కిలో ఉల్లి రూ.70, వెల్లుల్లి రూ.240, పల్లీనూనె రూ.210, పెసరపప్పు రూ.125, కందిపప్పు రూ.165 ఇలా.... అడ్డగోలుగా ధరలు పెరిగితే సామాన్య కుటుంబం ఎలా బతకాలని నిలదీశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. సన్నబియ్యం సహా నిత్యావసరాల ధరలకు వెంటనే నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## ఫ్యూచర్ సిటీలో విదేశీ వర్సిటీల క్యాంపస్‌లు.. ప్రత్యేక పాలసీకి తెలంగాణ సర్కార్ ప్లాన్

**(మొదటి పేజీ తరువాయి)**

ఆదేశించారు. తెలంగాణను అంతర్జాతీయ విద్యా కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు వేగవంతం చేయాలని సూచించారు.ఇప్పటికే యూనివర్సిటీ ఆఫ్ లండన్, యూనివర్సిటీ ఆఫ్ బర్మింగ్‌హామ్‌తో పాటు మరో నాలుగు అంతర్జాతీయ యూనివర్సిటీలు ఫ్యూచర్ సిటీలో క్యాంపస్‌లు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపినట్లు అధికారులు సీఎస్‌కు తెలిపారు.విదేశీ వర్సిటీలను ఆహ్వానించడం, అవసరమైన మౌలిక వసతులు కల్పించడం, పెట్టుబడులకు అవకాశం కల్పించడం, అనుమతులు సులభతరం చేయడం, విద్యా కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాలను పాలసీలో చేర్చాలని సంజయ్ జాజు సూచించారు. తెలంగాణ విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.ప్రతిపాదిత వర్సిటీల ప్రతినిధులతో చర్చలు జరిపి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. త్వరలో జరగనున్న గ్లోబల్ సమ్మిట్ నాటికి ఈ ప్రణాళిక సిద్ధంగా ఉండాలని సూచించారు.ఇదే సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్మిస్తున్న 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్'పైనా సమీక్షించారు. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో దశలవారీగా ఈ పాఠశాలలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2027 డిసెంబర్ నాటికి 67 పాఠశాలలను పూర్తి చేయాలని, 2028 జూన్ నాటికి ఈ సంఖ్యను 87కి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒక్కో పాఠశాలను సుమారు 26 ఎకరాల్లో నిర్మించనున్నారు. క్రీడా మైదానాలు, హాస్టళ్లు, సిబ్బంది క్వార్టర్లు, ఆధునిక వంటశాలలు, డిజిటల్ తరగతి గదుల వంటి సదుపాయాలు కల్పించనున్నారు. నిర్మాణ పనులను క్రమం తప్పకుండా సమీక్షించి, నాణ్యతతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు.

# ఫామ్-6 మార్పులపై రాజకీయ దుమారం.. సీఈసీపై రాహుల్ గాంధీ ఆరోపణలు

**(మొదటి పేజీ తరువాయి)**

ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించి ఫామ్-6లో మార్పులపై దాఖలైన పిటిషన్లను సోమవారం సుప్రీంకోర్టు విచారించింది. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం.. మార్చిన ఫామ్-6లోని మార్పులను సుప్రీంకోర్టు ఆమోదించలేదని స్పష్టం చేసింది. మార్పులు ఎవరు చేశారో తెలుసుకునేందుకు సంబంధిత రికార్డులను సమర్పించాలని ఎన్నికల సంఘాన్ని కోరింది.

సీఈసీపై రాహుల్ గాంధీ విమర్శలు

సుప్రీంకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో రాహుల్ గాంధీ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఫామ్-6ను చట్టవిరుద్ధంగా మార్చారని, ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ తన అధికారాలను దుర్వినియోగం చేసి బీజేపీకి అనుకూలంగా వ్యవహరించారని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంలో బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

మార్పులపై స్పష్టత ఇవ్వాల్సిందే

ఫామ్-6లో అసలు ఎలాంటి మార్పులు జరిగాయి, వాటిని ఎవరు ప్రతిపాదించారు, ఏ అధికారిక ప్రక్రియ ద్వారా అవి అమల్లోకి వచ్చాయి అనే అంశాలపై ప్రస్తుతం దృష్టి నెలకొంది. సుప్రీంకోర్టు కూడా ఈ వివరాలకు సంబంధించిన రికార్డులను కోరడంతో తదుపరి విచారణలో మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ఈసీ నిర్ణయాలపైనా కోర్టు దృష్టి

మరోవైపు, ముగ్గురు ఎన్నికల కమిషనర్ల సమ్మతి లేకుండా ఎన్నికల సంఘంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారన్న ఆరోపణలకు సంబంధించిన పిటిషన్లపైనా సుప్రీంకోర్టు స్పందించింది. ఎన్నికల సంఘం నిర్ణయాలు ఏకగ్రీవంగా తీసుకున్నవా, మెజారిటీ ఆధారంగా తీసుకున్నవా, లేక కేవలం సీఈసీ నిర్ణయాలేనా అనే అంశాలపై వివరాలు కోరుతూ కేంద్రం, ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసినట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి.ఇక ఫామ్-6 వ్యవహారంలో సుప్రీంకోర్టు కోరిన రికార్డులు కీలకంగా మారాయి. మార్పుల వెనుక అధికారిక ప్రక్రియ ఏమిటన్నది రికార్డుల పరిశీలన తర్వాతే స్పష్టమయ్యే అవకాశం ఉంది. అప్పటివరకు రాజకీయ ఆరోపణలు, కోర్టు పరిశీలనలను వేర్వేరుగా చూడాల్సి ఉంటుంది.

# కాళేశ్వరం మరమ్మతులు త్వరగా చేపట్టండి

**(మొదటి పేజీ తరువాయి)**

దిగువ (డౌన్ స్ట్రీమ్)లలో దయాఫ్రం వాల్ కట్టాల్సి ఉంటుందని తెలిపారు.దాంతో పాటు బ్యారేజీల గేట్ల నుంచి విడుదలయ్యే వరద ప్రవాహ ఉధృతిని తట్టుకోవడానికి వీలుగా నీళ్లు పడే ప్రదేశం (స్టిల్లింగ్ బేసిన్)ను కూడా విస్తరించాల్సి ఉంటుందని వివరించారు. 2019లో బ్యారేజీల నిర్మాణం పూర్తి కాగా... ఆ తర్వాత ఏటా వరదలకు గేట్లు ఎత్తినప్పుడు డౌన్‌స్ట్రీమ్‌లోని రక్షణ వ్యవస్థలన్నీ దెబ్బతింటున్నాయని, టెయిల్‌పాండ్ ఉంటే బ్యారేజీల గేట్ల నుంచి వరదలోని శక్తిని నిర్వీర్యం చేసే అవకాశం ఉండేదని పేర్కొన్నారు. అధికారుల వివరణ విన్న సీఎం.. బ్యారేజీల మరమ్మతుల డిజైన్‌లకు తుదిరూపు ఇచ్చి... కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ)లోని ఓవర్ సైట్ కమిటీ మథింపు అనంతరం పనులు ప్రారంభించాలని ఆదేశించారు. బ్యారేజీల ఎగువ, దిగువ భాగంలో దయాఫ్రం వాల్‌లు నిర్మించాలని, స్టిల్లింగ్ బేసిన్‌ను కూడా పెంచాలని సూచించారు.తుమ్మిడిహెట్టి బ్యారేజీ ప్రాథమిక సాధ్యాసాధ్యాల నివేదిక (పీఎ?ఫఆర్)పై కూడా సమావేశంలో చర్చ జరిగింది. తుమ్మిడిహెట్టి బ్యారేజీలపై సీడబ్ల్యూసీ అధికారులతో సమావేశం అనంతరం.. వారు కోరిన కీలక వివరాలన్నీ సీడబ్ల్యూసీకి, మహారాష్ట్ర అధికారులకు పంపించినట్లు అధికారులు తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని ఏదుల రిజర్వాయర్ నుంచే డిండి ఎత్తిపోతల పథకానికి నీటిని తరలించడానికి వీలుగా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. ఈ పథకం డీపీఆర్‌ను కేంద్రానికి సమర్పించినప్పుడే ఈ విషయాన్ని పొందుపరచడం జరిగిందన్నారు. పాలమూరు-రంగారెడ్డి పథకం పరిధిలో అవసరాలు తీర్చుతూనే డిండికినీటిని తరలించాలని ఆదేశించారు. డిండిలో కెనాల్, ఇతర కాంపోనెంట్లు కొలిక్కి వచ్చినప్పటికీ హెడ్ రెగ్యులేటరీ విషయంలో సందిగ్ధత ఉందని అధికారులు చెప్పగా.. ఏదుల నుంచే డిండికి నీటిని తరలించాలని సీఎం స్పష్టం చేశారు.

# ఓటుకు నోటు కేసులో కీలక మలుపు.. సుప్రీంకోర్టులో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్



తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 2015 నాటి ఓటుకు నోటు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన ఫిర్యాదుదారు, నామినేటెడ్ మాజీ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన వాదనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ ఆయన సర్వోన్నత న్యాయస్థానంలో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు.ఈ కేసు విచారణలో భాగంగా అదనపు వాదనలు వినిపించేందుకు తనకు అవకాశం కల్పించాలని స్టీఫెన్‌సన్ తన పిటిషన్‌లో కోరారు. ప్రధాన ఫిర్యాదుదారుగా తన వాదనలను వినడం నిష్పక్షపాత విచారణకు అత్యంత కీలకమని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు నివేదించారు. ఈ ఇంప్లీడ్ పిటిషన్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంటూ, తదుపరి విచారణను వాయిదా వేసింది. 2015 జూన్‌లో జరిగిన తెలంగాణ శాసనమండలి ఎన్నికల సందర్భంగా ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. టీడీపీ అభ్యర్థికి అనుకూలంగా ఓటు వేసేందుకు అప్పటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి (ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి) రూ. 50 లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో తెలంగాణ ఏసీబీ కేసు నమోదు చేసి రేవంత్ రెడ్డి సహా ముగ్గురిని అరెస్ట్ చేయడంతో పాటు నగదును స్వాధీనం చేసుకుంది. ఈ కేసులో ఆడియో, వీడియో రికార్డింగులను కీలక ఆధారాలుగా పేర్కొన్నారు. తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ రేవంత్ రెడ్డి ఇప్పటికే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ క్వాష్ పిటిషన్‌పై విచారణ జరుగుతున్న తరుణంలో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. తాజా పరిణామాలతో తెలుగు రాష్ట్రాల రాజకీయ, న్యాయ వర్గాల్లో ఈ కేసు మరోసారి చర్చనీయాంశంగా మారింది. తదుపరి విచారణలో ధర్మాసనం ఎలాంటి నిర్ణయం తీసుకోనుందోనన్న ఉత్కంఠ నెలకొంది.

## భారత్-అమెరికా వాణిజ్య చర్చలపై నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు




భారత్, అమెరికాల మధ్య కొంతకాలంగా కొనసాగుతున్న వాణిజ్య ఒప్పంద చర్చలు దాదాపుగా తుది దశకు చేరుకున్నప్పటికీ, ప్రస్తుతం అవి ప్రతిష్టంభనలో ఉన్నట్లు కనిపిస్తున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యం ప్రస్తుతం భారత్‌కు అనుకూలంగా ఉండటంతో, ఆ లోటును తగ్గించుకోవడానికి అమెరికా తీవ్రంగా ప్రయత్నిస్తోందని ఆమె వెల్లడించారు.సోమవారం ఢిల్లీలో నిర్వహించిన 'మ్యూనిచ్ లీడర్స్ మీటింగ్ 2026'లో ఆమె మాట్లాడారు. "వాణిజ్య ఒప్పందం కోసం ఇరు దేశాలు పట్టుదలగా చర్చలు జరిపాయి. ప్రస్తుతం ఇచ్చిపుచ్చుకునే ధోరణికి అతీతంగా చర్చలను ముందుకు తీసుకెళ్లడం కష్టతరంగా మారింది" అని ఆమె అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ, ఈ చర్చలను మరింత ముందుకు తీసుకెళ్లే అవకాశాలను ఇరుపక్షాలు అన్వేషించవచ్చని సూచించారు.భారత్‌తో వాణిజ్యం వల్ల తమకు ఏళ్లుగా నష్టం జరుగుతోందన్న అమెరికా ఆందోళన ఈ చర్చల్లో స్పష్టంగా ప్రతిబింబిస్తోందని ఆమె తెలిపారు. ఫిబ్రవరి 2026లో ప్రకటించిన మధ్యంతర వాణిజ్య ఒప్పంద ముసాయిదా ప్రాతిపదికన ఈ చర్చలు కొనసాగుతున్నాయి.ఇదే క్రమంలో భారత్-యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందాన్ని ఆమె ఒక విజయవంతమైన ఉదాహరణగా పేర్కొన్నారు. యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ అభివర్ణించినట్లుగా ఇది 'తల్లి లాంటి ఒప్పందం' అని ఆమె కొనియాడారు. ఈ ఒప్పందంలో భాగంగా భారత్ 92.5 శాతం టారిఫ్ లైన్లను, 97 శాతం వాణిజ్య విలువను అందుబాటులోకి తెస్తే, ఈయూ తన వైపు నుంచి 97 శాతం టారిఫ్ లైన్లను, 99 శాతం వాణిజ్య విలువను విముక్తం చేసిందని ఆమె వివరించారు.

# ప్రజావాణి అర్జీలను వెంటనే పరిష్కరించాలి





**ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి**

**మేడ్చల్-మల్కాజిగిరి, అక్టోబర్ 5 (నేటి వెలుగు):**
ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా నిబంధనల ప్రకారం వెంటనే పరిష్కరించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్‌తో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజావాణిలో రెవెన్యూ, పంచాయతీరాజ్, సివిల్ సప్లైస్, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించి మొత్తం 110 దరఖాస్తులు స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు ఎంతో నమ్మకంతో తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణిని ఆశ్రయిస్తున్నారని, వారి సమస్యలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ వేగంగా పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం చోటుచేసుకోకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో మాలతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పర్యటన ఏర్పాట్లు పక్కాగా ఉండాలి





**మంత్రుల పర్యటన నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**




**సూర్యాపేట, అక్టోబర్ 5 (నేటి వెలుగు):**
రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మంగళవారం సూర్యాపేట జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లు పక్కాగా ఉండాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. మంత్రుల పర్యటన, పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం, శంకుస్థాపనల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం చేపడుతున్న ఏర్పాట్లను కలెక్టర్ సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గడ్డిపల్లి, సయ్యద్ ముజావర్ పేట, పులిచింతల ప్రాజెక్టు ప్రాంతాల్లో సంబంధిత అధికారులతో కలిసి ఏర్పాట్లను సమీక్షించారు. మంత్రులు తొలుత పులిచింతల హైడ్రో పవర్ ప్రాజెక్టు సమీపంలోని హెలిప్యాడ్‌కు చేరుకుని, పులిచింతల హైడ్రో పవర్ ప్రాజెక్టును సందర్శిస్తారని కలెక్టర్ తెలిపారు. అనంతరం టీజీ జెన్‌కో, ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తదుపరి గరిడేపల్లి మండలం గడ్డిపల్లిలో సుమారు రూ.200 కోట్లతో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులను మంత్రులు పరిశీలించనున్నట్లు తెలిపారు. అనంతరం గడ్డిపల్లి నుంచి హెలికాప్టర్‌లో మునగాలకు చేరుకుని, సయ్యద్ ముజావర్ పేటలో రూ.9.60 కోట్లతో నిర్మించనున్న హరే కృష్ణ మిషన్ ఆధునిక కమ్యూనిటీ కిచెన్‌కు భూమిపూజ చేయనున్నట్లు వివరించారు. కలెక్టర్ ముందుగా గడ్డిపల్లిలోని ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూల్ నిర్మాణ ప్రాంగణాన్ని పరిశీలించి, మంత్రుల పర్యటన సమయానికి అన్ని ఏర్పాట్లు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మునగాల మండలం సయ్యద్ ముజావర్ పేటలో కమ్యూనిటీ కిచెన్ శంకుస్థాపన స్థలాన్ని, పులిచింతల మినీ హైడ్రాల్ ప్రాజెక్టు ప్రాంతాన్ని పరిశీలించారు. ఎలాంటి లోటూ రానివ్వొద్దుమంత్రుల పర్యటన సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. పులిచింతల ప్రాజెక్టు, గడ్డిపల్లి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, మునగాల శంకుస్థాపన ప్రాంగణాల వద్ద ట్రాఫిక్, భద్రత, తాగునీరు, ఇతర ప్రాథమిక సౌకర్యాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వేదిక ఏర్పాట్లు, భద్రతా చర్యలు, ప్రోటోకాల్ తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హుజూర్‌నగర్ ఆర్డీవో శ్రీనివాసులు, కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ, జెన్‌కో అధికారులు నందేశ్ కుమార్, నారాయణసింగ్ దేశ్‌నాయక్, ఎస్సీ జెన్‌కో సిబ్బంది, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి





**ప్రజావాణి పోర్టల్‌లో ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ నమోదు చేయాలి**

**పెండింగ్ దరఖాస్తులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**సూర్యాపేట, అక్టోబర్ 5 (నేటి వెలుగు):**
ప్రజల సమస్యల పరిష్కారానికి వేదికగా కొనసాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. ప్రజలు సమర్పించిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా జిల్లా, మండల స్థాయిలో స్వీకరించే ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రజావాణి పోర్టల్‌లో పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను కూడా ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారంపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని తెలిపారు. ప్రతి అధికారి తమ లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, నిర్లక్ష్యం వహించిన పక్షంలో సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ప్రజలు ఎంతో నమ్మకంతో సమర్పించే అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు.
మండల స్థాయి ప్రజావాణికి అధికారులు హాజరు కావాలిమండల స్థాయిలో ప్రారంభమైన ప్రజావాణి కార్యక్రమాలకు అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. మండల స్థాయిలోనే సమస్యలు పరిష్కారమైతే ప్రజలు జిల్లా కేంద్రానికి రావాల్సిన ఇబ్బందులు తప్పుతాయని పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 86 దరఖాస్తులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో భూ సమస్యలు, రెవెన్యూ శాఖకు సంబంధించి 49, డీపీఓకు 9, డీఎంఅండ్‌హెచ్ఓకు 3, డీఈఓకు 2 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. మిగిలిన 23 దరఖాస్తులు వివిధ శాఖలకు సంబంధించినవిగా ఉన్నాయని, వాటిని శాఖల వారీగా పరిష్కారం కోసం పంపించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డీఆర్వో ప్రేమ్‌రాజ్, జిల్లా పరిషత్ సీఈఓ శిరీష, డీఆర్డీఓ పీడీ సన్యాసయ్య, డీఎంహెచ్ఓ వెంకటరమణ, డీఏఓ శ్రీధర్‌రెడ్డి, జిల్లా స్పోర్ట్స్ అండ్ యూత్ వెల్ఫేర్ అధికారి వెంకటరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఉపేందర్, మున్సిపల్ కమిషనర్ హనుమంత్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఢిల్లీ పోలీసుల తీరును ఖండిస్తున్నాం

**ఏసీపీ వివేక్ భగత్‌ను సస్పెండ్ చేయాలి: ఫోరం ఫర్ కాన్స్టిట్యూషనల్ డెమోక్రసీ**

**హైదరాబాద్, అక్టోబర్ 5 (నేటి వెలుగు):**
ముగ్గురు మహిళా జర్నలిస్టులను వేధించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏసీపీ వివేక్ భగత్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి ఢిల్లీ పోలీసులు నిరాకరించడాన్ని ఫోరం ఫర్ కాన్స్టిట్యూషనల్ డెమోక్రసీ తీవ్రంగా ఖండించింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏసీపీని వెంటనే సస్పెండ్ చేసి, సమగ్ర విచారణ చేపట్టాలని ఫోరం డిమాండ్ చేసింది. ఫోరం కన్వీనర్ కె. రామచంద్ర మూర్తి, జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి, ప్రొఫెసర్ జి. హరగోపాల్, ప్రొఫెసర్ శాంతా సిన్హా, ప్రొఫెసర్ రమా మెల్కోటే, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, ప్రొఫెసర్ డి. నరసింహారెడ్డి, డా. గోపాల్ రెడ్డి గాదే, హైకోర్టు సీనియర్ న్యాయవాది జి. జ్యోతి కిరణ్ సోమవారం విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో ఈ మేరకు పేర్కొన్నారు. ఆదివారం ఒక్కరోజే ఏసీపీ వివేక్ భగత్‌పై మూడు ఫిర్యాదులు అందాయని, వాటిని విచారణ నిమిత్తం క్రైమ్ బ్రాంచ్‌కు పంపినట్లు ఢిల్లీ పోలీసులు పేర్కొంటున్నారని వారు తెలిపారు. అయితే ఇప్పటివరకు క్రైమ్ బ్రాంచ్ సదరు ఏసీపీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం విచారకరమన్నారు. మహిళలను వేధించడం తన అధికారిక విధుల్లో భాగమే అన్నట్లుగా సదరు అధికారి వ్యవహరిస్తున్నట్లు కనిపిస్తోందని వారు ఆరోపించారు. ఆయన ప్రవర్తనపై పోలీసు శాఖలోని ఉన్నతాధికారులకు సమాచారం లేకపోవడం కూడా ఆశ్చర్యకరమన్నారు. ముగ్గురు జర్నలిస్టుల్లో ఇద్దరు గతంలో కూడా సదరు ఏసీపీపై ఫిర్యాదు చేసినప్పటికీ, ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఫోరం ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఢిల్లీ పోలీసు ఉన్నతాధికారులు స్పందించి ఏసీపీ వివేక్ భగత్‌ను సస్పెండ్ చేయడంతో పాటు, ఫిర్యాదులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి నిష్పక్షపాతంగా దర్యాప్తు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

# ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదు చేయని 68 మంది ఉపాధ్యాయులకు షోకాజ్

**హాజరు ఆధారంగానే జీతాల విడుదలకు ఆదేశాలు**

**నిర్లక్ష్యం వహిస్తే నిబంధనల ప్రకారం చర్యలు: డీఈఓ ఎస్. వెంకటేశ్వర్లు**



**రంగారెడ్డి, అక్టోబర్ 5 (నేటి వెలుగు):**
పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరు నమోదును పర్యవేక్షించేందుకు అమలు చేస్తున్న ఎఫ్ఆర్ఎస్ (ఎఫ్ఆర్ఎస్) విధానంలో గత నెల రోజులుగా హాజరు నమోదు చేయని 68 మంది ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) ఎస్. వెంకటేశ్వర్లు తెలిపారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరును ఎఫ్ఆర్ఎస్ ద్వారా తప్పనిసరిగా నమోదు చేయాల్సి ఉండగా, గత నెల రోజులుగా హాజరు నమోదు చేయని ఉపాధ్యాయుల వివరాలను విద్యాశాఖ అధికారులు పరిశీలించారు. హాజరు నమోదులో నిర్లక్ష్యం వహించిన వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే ప్రక్రియలో భాగంగానే షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు డీఈఓ వెల్లడించారు. గత నెల రోజులుగా ఎఫ్ఆర్ఎస్‌లో హాజరు ఎందుకు నమోదు చేయలేకపోయారో, అందుకు గల కారణాలను వివరిస్తూ సంబంధిత ఉపాధ్యాయులు షోకాజ్ నోటీసులకు సమాధానం సమర్పించాలని డీఈఓ ఆదేశించారు. ఉపాధ్యాయులు సమర్పించే వివరణలను పరిశీలించిన అనంతరం నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. హాజరు ఆధారంగానే జీతాలుఉపాధ్యాయుల ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదును ఆధారంగా చేసుకుని జీతాల విడుదల చేపట్టాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి జిల్లా ట్రెజరీ అధికారి (డీటీఓ)ను ఆదేశించినట్లు అధికారులు తెలిపారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల సమయపాలన, హాజరు నమోదును మరింత పకడ్బందీగా అమలు చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరు, బోధనా ప్రక్రియ, విద్యార్థుల అభ్యసన స్థాయిలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని డీఈఓ తెలిపారు. ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదులో నిర్లక్ష్యం వహించే ఉపాధ్యాయులపై నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందుకు అనుగుణంగా ప్రతి ఉపాధ్యాయుడు విధులకు సమయానికి హాజరై తప్పనిసరిగా ఎఫ్ఆర్ఎస్‌లో హాజరు నమోదు చేయాలని డీఈఓ ఎస్. వెంకటేశ్వర్లు సూచించారు. పాఠశాలల్లో క్రమశిక్షణ, సమయపాలన, బోధనా నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికీ తావులేకుండా చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# ప్రజా ఫిర్యాదులపై సత్వర స్పందన

**బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి: నల్గొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్**



**నల్గొండ, అక్టోబర్ 5 (నేటి వెలుగు):**
ప్రజలు సమర్పించే ఫిర్యాదులపై సత్వరమే స్పందించి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో ఎస్పీ శరత్ చంద్ర పవార్ జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధి నుంచి వచ్చిన సుమారు 53 మంది బాధితుల సమస్యలు, ఫిర్యాదులను స్వయంగా విని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక లావాదేవీలు, మోసాలు, ఆస్తి సంబంధిత వివాదాలు తదితర అంశాలపై తమ ఫిర్యాదులను ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి ఫిర్యాదును పరిశీలించిన ఎస్పీ సంబంధిత పోలీస్ అధికారులు, సిబ్బందితో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. బాధితుల ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి, వాస్తవాలను నిర్ధారించిన అనంతరం చట్టపరమైన నిబంధనల ప్రకారం సత్వర చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం చేయకుండా, ప్రతి కేసు పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. నిష్పక్షపాతంగా విచారణ జరపాలిప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖపై నమ్మకంతో వస్తున్నారని, వారి ఫిర్యాదులను గౌరవంగా స్వీకరించి నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించడం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని తెలిపారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా జిల్లా ఎస్పీని కలిసి తమ సమస్యలను వివరించే అవకాశం కల్పిస్తున్నామని శరత్ చంద్ర పవార్ తెలిపారు. ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతతో పరిశీలించి, చట్ట పరిధిలో సత్వర పరిష్కారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## దళిత మహిళపై దాడి.. మాజీ సర్పంచ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి

**పరారీలో ఉన్న కొప్పోలు అమర్నాథ్ గౌడ్‌ను పట్టుకుని రిమాండ్ చేయాలి**

**అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పుల్లెంల సందీప్ డిమాండ్**



**నల్గొండ టౌన్, అక్టోబర్ 05 (నేటి వెలుగు ప్రతినిధి):**
మండలం పీకే మల్లేపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో దారుణ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన దళిత మహిళ గనిపల్లి మాధవిపై మాజీ సర్పంచ్ కొప్పోలు అమర్నాథ్ గౌడ్ అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడికి పాల్పడ్డారని ఆరోపణలు వెల్లువెత్తాయి. నిండు గ్రామసభలోనే మహిళపై చేయి చేసుకోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించాల్సిన గ్రామసభలోనే మహిళపై దాడి జరగడం పట్ల గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ఘటన అనంతరం అమర్నాథ్ గౌడ్ పరారీలో ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పుల్లెంల సందీప్ తీవ్రంగా స్పందించారు. దళిత మహిళపై దాడి చేయడం అత్యంత తీవ్రమైన విషయమని, ఘటనపై పోలీసులు సమగ్రంగా దర్యాప్తు చేసి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. "రాజ్యాంగం అమలులో ఉన్నప్పటికీ దళిత మహిళపై నిండు గ్రామసభలో దాడి జరగడం సిగ్గుచేటు. ఘటనకు బాధ్యుడైన వ్యక్తిపై వర్తించే చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి. ఎక్కడున్నా కొప్పోలు అమర్నాథ్ గౌడ్‌ను వెంటనే అదుపులోకి తీసుకుని చట్టపరమైన చర్యలు చేపట్టాలి. బాధితురాలికి న్యాయం చేయాలి. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతాం" అని పుల్లెంల సందీప్ హెచ్చరించారు. బాధితురాలికి రక్షణ కల్పించడంతో పాటు, ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్

## ఆర్టీఐ చట్టంపై ప్రజల్లో అవగాహన పెంచాలి

**సమాచార హక్కు చట్టం--2005 ఆవిర్భావ దినోత్సవ సదస్సు కరపత్రం విడుదల చేసిన నల్గొండ కలెక్టర్ బి. చంద్రశేఖర్**

**నల్గొండ, అక్టోబర్ 5 (నేటి వెలుగు):**



సమాచార హక్కు చట్టం--2005పై ప్రజల్లో మరింత అవగాహన కల్పించడంతో పాటు, ఓటర్లను చైతన్యపరిచేందుకు చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని నల్గొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఐఏఎస్ అన్నారు.సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు ముదిరాజ్ ఆధ్వర్యంలో ఈ నెల 12న హైదరాబాద్‌లోని ప్రెస్ క్లబ్, సోమాజిగూడలో నిర్వహించనున్న సమాచార హక్కు చట్టం--2005 ఆవిర్భావ దినోత్సవ సదస్సు కరపత్రాన్ని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ విడుదల చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలకు ప్రభుత్వ వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనంపై అవగాహన కల్పించేందుకు సంస్థ చేస్తున్న కృషిని అభినందించారు. అదే విధంగా ఓటర్లలో చైతన్యం తీసుకురావడానికి డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు ముదిరాజ్ చేస్తున్న కార్యక్రమాలను ప్రశంసించారు.సదస్సును విజయవంతం చేయాలికలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపిన డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు ముదిరాజ్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో నిర్వహించనున్న సదస్సును విజయవంతం చేసేందుకు సంస్థ కార్యకర్తలు బాధ్యతగా పనిచేయాలని కోరారు. పలువురు ప్రముఖులు, కార్యకర్తలు, సమాచార హక్కు చట్టంపై ఆసక్తి ఉన్నవారు సదస్సుకు హాజరయ్యేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంస్థ ముఖ్య సలహాదారుడు కోట్ల రామలింగయ్య, పుట్ట విజయ్ కుమార్, కర్నాటి యాదగిరి, కాసుల అజయ్ కుమార్, మేకల శ్రీహరి, తాటి నిరంజన్, మామిడి యాదయ్య, గండి రాము, కారింగు శ్రీకాంత్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీలకు అతీతంగా పట్టణాభివృద్ధే లక్ష్యం

**మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట: మున్సిపల్ చైర్మన్ మొరిశెట్టి నివేదిత లక్షాది**



**సూర్యాపేట పట్టణం అక్టోబర్ 05 నేటి వెలుగు ప్రతినిధి:**

పట్టణాన్ని పార్టీలకు అతీతంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే మున్సిపాలిటీ ప్రధాన ధ్యేయమని సూర్యాపేట మున్సిపల్ చైర్మన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు.సోమవారం పట్టణంలోని 43వ వార్డులో రూ.5 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ డ్రెయిన్, రోడ్డు పనులకు మున్సిపల్ చైర్మన్ అధికారికంగా శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వార్డుల్లోని ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని పేర్కొన్నారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యతా క్రమంలో పనులను చేపడుతూ పట్టణ అభివృద్ధికి కృషి చేస్తున్నామని చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ బత్తుల జాన్సీ రమేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, మున్సిపల్ అధికారులు డీఈ ప్రణయ్‌రెడ్డి, ఏఈ తిరుమలయ్య, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల వెలికితీతలో పాత్రికేయుల పాత్ర కీలకం...

**నల్లగొండ తహశీల్దార్ , ఎంపీడీవోలు**

**నల్గొండ అక్టోబర్ 5 నేటి వెలుగు ప్రతినిధి:**



ప్రజా సమస్యల వెలికితీతలో పాత్రికేయుల పాత్ర కీలకమని నల్లగొండ తహశీల్దార్ కె. పరుశురాం, ఎంపీడీవో భూక్యా యాకూబ్ నాయక్ లు పేర్కొన్నారు. ఇటీవల టీయూడబ్ల్యూజే (హెచ్-143) జర్నలిస్టుల సంఘం నల్లగొండ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన సీనియర్ జర్నలిస్ట్ చిక్కుల యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన పేరం సుభాష్ లను వేర్వేరుగా తమ కార్యాలయాల్లో శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిష్పక్షపాతంగా, నిజాయితీగా వార్తలు అందిస్తూ సమాజ సేవ చేస్తున్న పాత్రికేయుల కృషి అభినందనీయమని కొనియాడారు. జర్నలిస్టులకు ఎల్లప్పుడూ తమ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ డిటి అజీంఖాన్, సీనియర్ అసిస్టెంట్ శంకర్, ఆయా పార్టీల నాయకులు చింత ముత్యాలరావు, జగ్జీవన్ రామ్, గాదె యాదయ్య, జి.చెన్నారం సర్పంచ్ సాంబయ్య, పగిళ్ల వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

## కళాశాలలో ఆధ్యాత్మిక సందడి.. విద్యార్థుల్లో ఉత్సాహం నింపిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ భజనలు

**నల్లగొండ అక్టోబర్ 5 నేటి వెలుగు ప్రతినిధి:**

విద్యార్థుల్లో మానసిక ప్రశాంతత, సానుకూల ఆలోచనలు, ఆధ్యాత్మిక చింతనను పెంపొందించే లక్ష్యంతో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా కేంద్రంలోని గౌతమి కళాశాలలో ప్రత్యేక భజన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్ బాలకృష్ణ ఆధ్వర్యంలో అంతర్జాతీయ గాయకుడు అమిత్ నారాయణ్ బృందం నిర్వహించిన ఉత్సాహభరితమైన భజన కార్యక్రమం విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంది. సుమారు గంటపాటు సాగిన ఈ ఆధ్యాత్మిక సంగీత కార్యక్రమంతో కళాశాల ప్రాంగణం ఆనందోత్సాహాలతో నిండిపోయింది.భక్తిగీతాల మధుర స్వరాలకు విద్యార్థులు లయబద్ధంగా అడుగులు వేస్తూ, ఆటపాటలతో సందడి చేశారు. సంగీతం, భక్తి, ఆధ్యాత్మికత కలగలిసిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది.

మానసిక ప్రశాంతతకు ధ్యానమే మార్గం ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఒత్తిడిని అధిగమించేందుకు ధ్యానం, భజనలు, సానుకూల ఆలోచనలు ఎంతగానో దోహదపడతాయని ఆర్ట్ ఆఫ్ లివింగ్ బృందం వివరించింది.మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవడం, ప్రతికూల ఆలోచనలను గుర్తించి వాటిని అధిగమించడం, ధ్యానం ద్వారా మానసిక స్థిరత్వాన్ని పెంపొందించుకోవడం వంటి అంశాలను విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో వివరించారు.ఆర్ట్ ఆఫ్ లివింగ్ కార్యక్రమాల ద్వారా ఏకాగ్రతను పెంపొందించుకోవడంతో పాటు చదువులో మెరుగైన ఫలితాలు సాధించేందుకు అవసరమైన మానసిక ప్రశాంతతను పొందవచ్చని తెలిపారు. విద్యార్థులు తమ దైనందిన జీవితంలో ధ్యానం, సానుకూల దృక్పథాన్ని భాగం చేసుకోవాలని సూచించారు.

విద్యార్థుల్లో కొత్త ఉత్సాహం

భజనలతో పాటు ఆధ్యాత్మిక సందేశాలను అందించిన ఈ కార్యక్రమం విద్యార్థులకు ఆహ్లాదాన్ని, మానసిక ఉల్లాసాన్ని అందించింది. చదువుతో పాటు మానసిక ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యత ఇవ్వాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం చాటిచెప్పింది.కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్ బాలకృష్ణ, ఆయన కుటుంబ సభ్యులు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వాలంటీర్లు గుండగోని జయశంకర్, పోగుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎఫ్‌సీఐలో ఘనంగా ముగిసిన హిందీ పక్షోత్సవాలు






**● హిందీ వినియోగాన్ని మరింత ప్రోత్సహించాలి: డివిజనల్ మేనేజర్ సువీన్ కుమార్**

**నల్గొండ, అక్టోబర్ 5 (నేటి వెలుగు):**

ఎఫ్‌సీఐ నల్గొండ డివిజనల్ కార్యాలయంలో సెప్టెంబర్ 14 నుంచి 30 వరకు నిర్వహించిన హిందీ పక్షోత్సవాలు--2026 ఘనంగా ముగిశాయి. సోమవారం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎఫ్‌సీఐ నల్గొండ డివిజనల్ మేనేజర్ సువీన్ కుమార్ మాట్లాడుతూ.. హిందీ పక్షోత్సవాల్లో అధికారులు, ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయడం అభినందనీయమన్నారు. కార్యాలయ కార్యకలాపాల్లో హిందీ వినియోగాన్ని మరింత ప్రోత్సహించాలని సూచించారు.హిందీ వినియోగంలో నల్గొండ డివిజన్ తెలంగాణ ప్రాంత స్థాయిలోనే కాకుండా జోనల్, జాతీయ స్థాయిలోనూ అగ్రస్థానంలో నిలిచేలా ఉద్యోగులు కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు.కార్యక్రమంలో పాల్గొన్న సంస్థ ఏజీఎం (క్యూసీ) డా. రాఘవేంద్ర సింగ్ మాట్లాడుతూ.. ఉద్యోగుల్లో హిందీ భాషపై ఆసక్తిని పెంపొందించేందుకు నిర్వహించిన వివిధ పోటీలు ఎంతగానో ఉపయోగపడ్డాయని అన్నారు. హిందీ పక్షోత్సవ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించిన హిందీ విభాగం సిబ్బందిని అభినందించారు.ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు బహుమతులుహిందీ పక్షోత్సవాల్లో భాగంగా నిర్వహించిన హిందీ నోటింగ్ అండ్ డ్రాఫ్టింగ్, ఖాళీల పూరణ, వ్యాసరచన, అనువాదం, క్విజ్ తదితర పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు ఈ సందర్భంగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సీనియర్ అధికారి కాసిరెడ్డి, ఉద్యోగులు మమత, షాహిద్, స్వాతి, రాంబాబు, అనిల్, రూప, ఝాన్సీ, యోగిత, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు విరివిగా పంట రుణాలు అందించాలి

**అర్హత ఉన్న ప్రతి రైతుకు రుణం అందేలా చూడాలి: కలెక్టర్ బి. చంద్రశేఖర్**

**నల్గొండ, అక్టోబర్ 5 (నేటి వెలుగు):**




రైతులకు విరివిగా పంట రుణాలు అందించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) అధికారులను ఆదేశించారు. రైతులకు రుణాల మంజూరులో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని స్పష్టం చేశారు.సోమవారం నల్గొండలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ పంట రుణాలు, బ్యాంకు కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించారు. కొత్తగా వ్యవసాయం చేస్తున్న రైతులకు కూడా రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని, కొత్త రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేసి అర్హత ఉన్న ప్రతి రైతుకు బ్యాంకు రుణం అందేలా చూడాలని సూచించారు.యాసంగి సాగు ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు రుణాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. వ్యవసాయ యంత్ర పరికరాల కొనుగోలుకు రుణాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు (ఎఫ్‌పీఓలు) రుణాలు అందించాలని తెలిపారు.అదేవిధగా ఫుడ్ కోర్టులు, కొబ్బరి ఆధారిత యూనిట్లు, కోల్డ్ స్టోరేజీలు, వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన రుణాలు అందించి రైతులు, యువత స్వయం ఉపాధి పొందేలా ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు.

మహిళా సంఘాలు, యువతకు రుణాలు మహిళా స్వయం సహాయక సంఘాలకు, సొసైటీలకు విరివిగా రుణాలు అందించాలని అన్నారు. అర్హులైన వారికి వాహన, గృహ రుణాలు మంజూరు చేయడంతో పాటు వాటిపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన గృహ రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.రుణ దరఖాస్తుల పరిశీలన, మంజూరు ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులు, మహిళా సంఘాలు, యువత, చిన్న వ్యాపారులకు అవసరమైన రుణ సదుపాయాలను విస్తృతంగా అందిస్తూ డీసీసీబీ సేవలను మరింత విస్తరించాలని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, డీసీసీబీ సీఈఓ శంకర్‌రావు, డీసీఓ మమత, జిల్లా వ్యవసాయ అధికారి వినోద్‌కుమార్, లీడ్ బ్యాంక్ అధికారి శ్రామిక్, డీసీసీబీ జీఎం నర్మద, డీజీఎం లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం అశోక్ సార్‌దే

**గత ఎన్నికల్లో ప్రధాన పార్టీలకు ముచ్చెమటలు పట్టించిన పాలకూరి అశోక్ సార్.. మరోసారి బరిలోకి**

**నల్లగొండ, అక్టోబర్ 6 నేటి వెలుగు ప్రతినిధి:**

ఖమ్మం--వరంగల్--నల్లగొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మరోసారి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలుస్తున్నట్లు పాలకూరి అశోక్ సార్ ప్రకటించారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని ఎస్‌పీఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన తన అభ్యర్థిత్వాన్ని ప్రకటించారు.గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో 30 వేల మొదటి ప్రాధాన్యత ఓట్లు, 90 వేల రెండో ప్రాధాన్యత ఓట్లు సాధించి ప్రధాన పార్టీలకు ముచ్చెమటలు పట్టించానని అశోక్ సార్ అన్నారు. బీఆర్ఎస్ ఓటమికి తానే ప్రధాన కారణమని పేర్కొంటూ, ఈసారి కూడా తన విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

బీసీలకు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలి

తెలంగాణలో 90 శాతానికి పైగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42 శాతం రాజకీయ ప్రాతినిధ్యం కల్పిస్తామని హామీ ఇచ్చి, ఆచరణలో విఫలమైందని విమర్శించారు.బీసీలకు అవకాశం ఉన్నప్పటికీ ఎమ్మెల్సీ స్థానాల్లో వారికి ప్రాధాన్యత ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. “ఓట్లు మావి.. సీట్లు మీవా?” అని రాజకీయ పార్టీలను ప్రశ్నించారు. బీసీలంతా ఐక్యంగా నిలిస్తే తమ హక్కులను సాధించుకోవచ్చని అన్నారు.నిరుద్యోగుల కోసం 15 ఏళ్లుగా పోరాటంగత 15 ఏళ్లుగా నిరుద్యోగులు, తెలంగాణ సమాజం కోసం పోరాడుతున్నానని అశోక్ సార్ తెలిపారు. తనపై బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో 18 కేసులు పెట్టినా ఏ ప్రభుత్వానికి అంటకాగకుండా నిరుద్యోగుల పక్షాన నిలిచానన్నారు.ప్రాణాలను సైతం లెక్కచేయకుండా మూడు సార్లు ఆమరణ నిరాహార దీక్షలు చేపట్టానని తెలిపారు. లక్షలాది మంది విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా తక్కువ ఫీజుతో, ఉచితంగా పాఠాలు బోధించానని చెప్పారు. నిరుద్యోగుల సమస్యలపై రోడ్డుపై పోరాటాలు చేయడంతో పాటు, పోలీసుల నిర్బంధాలను ఎదుర్కొని, న్యాయం కోసం కోర్టు మెట్లు ఎక్కానని పేర్కొన్నారు.

ఉద్యోగాలపై ప్రభుత్వాన్ని నిలదీశారు

ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు తగిన స్థాయిలో ఉద్యోగాలు కల్పించలేదని అశోక్ సార్ విమర్శించారు. ఉద్యోగాల విషయంలో ప్రభుత్వం ప్రజలకు వాస్తవాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు.గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 ఉద్యోగాల నోటిఫికేషన్లు విడుదల చేసిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. పవర్ సెక్టార్‌లో 5,300 ఉద్యోగాలకు ఆర్థిక శాఖ ఆమోదం లభించినప్పటికీ ఇప్పటివరకు నోటిఫికేషన్ విడుదల కాలేదన్నారు. 25 వేల ఉద్యోగాలతో మెగా డీఎస్సీని ఉద్యోగ క్యాలెండర్‌లో ప్రకటించినా అమలులో పురోగతి లేదని విమర్శించారు.33 జిల్లాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు ఏర్పాటు చేయాలిరాష్ట్రంలోని 33 జిల్లాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అశోక్ సార్ డిమాండ్ చేశారు.ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై ప్రభుత్వం కేవలం ప్రకటనలకే పరిమితమైందని విమర్శించారు. ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని కోరారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను పెంచడంతో పాటు, ఏజెన్సీల వ్యవస్థలో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలని డిమాండ్ చేశారు.‘నాన్ లోకల్ గో బ్యాక్’ నినాదంతో ఉద్యమంరాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో పరిశ్రమలు, ఐటీ, పెట్టుబడులు, ఉద్యోగాల విషయంలో స్థానిక తెలంగాణ యువతకు తగిన అవకాశాలు లభించడం లేదని అశోక్ సార్ ఆరోపించారు. శివసేన ఉద్యమ స్ఫూర్తితో ‘నాన్ లోకల్ గో బ్యాక్’ నినాదంతో ఉద్యమం చేపట్టనున్నట్లు ప్రకటించారు.తెలంగాణ బిడ్డలకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాలు కల్పించడమే తన ప్రధాన ఎన్నికల నినాదమని తెలిపారు.

విద్య, వైద్యం ఉచితంగా అందాలి

భౌగోళిక తెలంగాణ ఏర్పడినా సామాజిక తెలంగాణ సాధించలేదని అశోక్ సార్ అన్నారు. తెలంగాణలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల్లో రాజకీయ చైతన్యం ఓటు రూపంలో వ్యక్తమైనప్పుడే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. బీసీలంతా ఐక్యంగా నిలిచి తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. “మేమెంతో.. మాకంత” అనే నినాదంతో హక్కుల కోసం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 18 శాతం నిధులు కేటాయించాలని, విద్యా, వైద్యం పూర్తిగా ఉచితంగా అందించినప్పుడే సామాజిక తెలంగాణ సాధించినట్లుగా భావించాలని అన్నారు.ఈ విలేకరుల సమావేశంలో కె.వి. గౌడ్, ప్రణీత్, నవీన్ రెడ్డి, కిరణ్, రవి కొండల్, మహేష్, సురేష్, సంధ్య, ఇందు తదితరులు పాల్గొన్నారు.



Edited, Published and owned by **PAMANAGUDNDLA NAVEEN KUMAR,** Printed at **SRI printers** at H.No. 1-47/1, Ganesh Nagar, Dandampelly, Nalgonda , Telangana State : Editor, **PAMANAGUDNDLA NAVEEN KUMAR** : **RNI No. TELTEL 2023/88559**, Cell : **9553276552,**